సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 3 । మార్చి । 2024



ఎందుకీ నిర్లక్ష్యం?

ఈ–చలాన్లు చెల్లించడానికి ప్రభుత్వం రాయితీలు కల్పించినా ముందుకు రాలేదు.

వివరాలు 8లో ▸



మన్యంకొండ.. జనసంద్రం

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం జనసంద్రమైంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /16.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఒబేదుల్లా కొత్వాల్



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన ఒబేదుల్లా కొత్వాల్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇతర నూతన కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి కొత్వాల్ రేవంత్‌రెడ్డికి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందని, ప్రభుత్వ పథకాలను మైనార్టీలకు చేరేలా తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం రెండో సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. జిల్లాలోని 33 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా.. 9,775 మంది విద్యార్థులకు గాను 9,570 మంది హాజరవగా.. మరో 205 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ శ్రీధర్ సుమన్, స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు బుధవారం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వీరికి 10న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. శిక్షణ పొందే వారికి భోజన సదుపాయం, స్టడీ మెటీరియల్, శిక్షణ ఉచితంగా అందిస్తామని చెప్పారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్సీఓ నాగార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్‌సీలో బోధన, వసతి ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో అడ్మిషన్లు పొందేందుకు అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి ఛత్రునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలతో ఈ నెల 11లోగా ఎస్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 14న లాటరీ పద్ధతిలో ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్టీ హాస్టల్ వార్డెన్ సస్పెండ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్ బాలస్వామిని జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శనివారం సస్పెండ్ చేశారు. గత నెల 15న జరిగిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా స్టేజీపై జిల్లా అధికారులను పట్టించుకోకుండా ఎమ్మెల్యే పక్కన కూర్చునందుకు ఆయనపై చర్యలు తీసుకున్నారు. ఆయన నుంచి వివరణ తీసుకున్న అనంతరం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా ఎస్టీ సంక్షేమశాఖ అధికారి చత్రునాయక్‌కు వివరణ కోరగా ప్రొటోకాల్ పాటించనందుకు వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు చెప్పారు.


నేడు గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శనివారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

‘పోరు’ కసరత్తు..

లోక్‌సభ ఎన్నికలకు పార్టీల సమాయత్తం

- నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పి.భరత్
- పాలమూరు టికెట్ కోసం త్రిముఖ పోటీ
- డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, శాంతకుమార్ ముమ్మర యత్నాలు
- కాంగ్రెస్‌లో 2 స్థానాల్లోనూ అభ్యర్థిత్వాలు కొలిక్కి..
- మహబూబ్‌నగర్ చల్లా వంశీచంద్‌కే ఖరారు
- కందనూలు రేసులోకి మల్లురవి
- బీఆర్‌ఎస్‌లో అనిశ్చితి.. ‘గులాబీ’ శ్రేణుల్లో నైరాశ్యం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఎన్నికల సన్నద్ధతపై దృష్టిపెట్టాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికతో పాటు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలుండగా బీజేపీ నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు తనయుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్‌ను ప్రకటించింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సైతం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించాయి. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండగా.. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నాహాల్లో వేగం పెంచాయి. ఇప్పటికే బీజేపీ ముఖ్యనేతలు సంకల్ప యాత్రను మొదలుపెట్టగా, మహబూబ్‌నగర్ స్థానంలో కాంగ్రెస్ నేత చల్లా వంశీచంద్‌రెడ్డి ‘పాలమూరు న్యాయ యాత్ర’ పేరుతో పాదయాత్ర చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6వ తేదీన పాలమూరు నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలను నిర్వహించింది.

కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాలు కొలిక్కి..

జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఇటీవల కోస్గిలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయన పేరును ప్రకటించారు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎంపీ మల్లురవి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆసక్తి చూపుతున్నారు. పార్టీలో ఒక వ్యక్తికి ఒక పదవే ఉండాలనే నిబంధన లోక్‌సభ బరిలో నిలిచేందుకు అడ్డు రాకూడదనే ఉద్దేశంతో మల్లురవి ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీ చేయాలనే పట్టుదలతో మల్లురవి ఉండగా.. ఆయన వైపే అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థిత్వాల ఖరారు ఓ కొలిక్కి రావడంతో రెండు స్థానాల్లోనూ గెలుపు వ్యూహాల అమలుపై అధిష్టానం నజర్ వేసింది.

మహబూబ్‌నగర్ బీజేపీ టికెట్ ఎవరికో..

నాగర్‌కర్నూల్ స్థానం నుంచి బంగారు శ్రుతితో పాటు ఎస్సీ వర్గానికి చెందిన రాష్ట్రస్థాయి నేతలు సైతం పోటీపడ్డారు. అయితే బీఆర్‌ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ రాములు, ఆయన కుమారుడు భరత్ ప్రసాద్ పార్టీలో చేరగా..ఆ వెంటనే టికెట్ కేటాయించారు. శనివారం సాయంత్రం బీజేపీ అధిష్టానం తెలంగాణలోని 9 లోక్‌సభ స్థానాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులను ప్రకటించగా.. అందులో భరత్ పేరును సైతం ఖరారు చేశారు. జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి బరిలో నిలిచేందుకు పార్టీ నేతల నుంచి పోటీ ఎక్కువగా కన్పిస్తోంది. ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఈ స్థానంపై ఎవరికి వారు పట్టుబట్టి భీష్మించుకుని కూర్చున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఒకరికి సమీప జిల్లాలోని ఒక స్థానంలో అవకాశం ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు వినికిడి. మహబూబ్‌నగర్‌పై ఎవరూ బెట్టు వీడకపోవడంతో బీజేపీ పెద్దలు ఈ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టినట్లు ఆ పార్టీ ముఖ్యుల్లో చర్చ జరుగుతోంది.

నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రొఫైల్

పూర్తిపేరు: పోతుగంటి భరత్‌కుమార్
తల్లిదండ్రులు: పోతుగంటి భాగ్యలక్ష్మి, రాములు (ప్రస్తుత ఎంపీ)
సామాజిక వర్గం: ఎస్సీ(మాదిగ)
పుట్టిన తేదీ: 07–08–1987
స్వస్థలం: గుండూరు, కల్వకుర్తి మండలం
నివాసం: టీచర్స్ కాలనీ అచ్చంపేట
చదువు: బీటెక్, ఎంబీఏ(జెఎన్‌టీయూ), ఎల్‌ఎల్‌బీ(ఉస్మానియా)
రాజకీయ ప్రవేశం, పదవులు: భరత్ ప్రసాద్ తండ్రి రాములు ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉన్నారు. తండ్రి సూచన మేరకు 2019లో బీఆర్‌ఎస్(టీఆర్‌ఎస్) నుంచి రాజకీయ రంగప్రవేశం చేశారు. అదే ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించారు. మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి వల్ల రెండుసార్లు జెడ్పీచైర్మన్ పదవి దగ్గరికి వచ్చి చేజారింది. దీంతో బీఆర్‌ఎస్‌లో ఇమడలేక ఇటీవల తండ్రితో కలిసి కమలం గూటికి చేరారు. ప్రస్తుతం భరత్ రాష్ట్ర జెడ్పీటీసీల సంఘం జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.



పోతుగంటి భరత్‌కుమార్

ఎంపీ మన్నె వ్యాఖ్యల వెనుక మర్మమేమిటో..

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఇటీవల జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనుల ప్రారంభోత్సవ సమావేశంలో ప్రధాని మోదీని బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కీర్తించడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో పారదర్శక పాలన సాగుతోందని, ఆయన ప్రధానిగా కొనసాగడం దేశానికి గర్వకారణమంటూ ఆయన కీర్తించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఆ మాటల వెనుక మర్మమేమిటనే చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

బీఆర్‌ఎస్‌లో అనిశ్చితి..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్‌ఎస్‌లో అనిశ్చితి కొనసాగుతోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీలకు సీట్లిచ్చే అవకాశాలు తక్కువగా కన్పిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలావరకు స్థానాల్లో కొత్తవారినే ఎంపీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తారనే ఊహాగానాలు పార్టీలో విన్పిస్తున్నాయి. అయితే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే బాలరాజు ఉత్సాహంగా ఉన్నా.. అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ సన్నాహకాల్లో భాగంగా ఇప్పటికే తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలను నిర్వహించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఈ ఫీడ్ బ్యాక్‌ను పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కేటీఆర్ కొన్నిరోజులుగా పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గతవారం నాగర్‌కర్నూల్, అచ్చంపేటలో సన్నాహక సమావేశాలకు హాజరయ్యారు. ఇలా రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజవర్గాల్లో సన్నాహక సమావేశాలు ముగిసిన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై స్పష్టత రానున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. సుమారు పదేళ్ల పాటు అధికారంలో ఉండి, ఎదురులేని శక్తిగా అవతరించిన బీఆర్‌ఎస్‌లో ప్రస్తుత పరిణామాలు ఒకింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు



- నేడు పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన వైద్య, ఆరోగ్య శాఖ
- జిల్లాలో 1,10,136 మంది చిన్నారుల గుర్తింపు

పాలమూరు: జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీకి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 16 మండలాల్లో ఉన్న 18 పీహెచ్‌సీలు, 190 సబ్ సెంటర్లు, 2 కమ్యూనిటీ హెల్త్, ఒక ఏరియా సెంటర్‌తోపాటు అర్బన్ హెల్త్ సెంటర్లు, 441 గ్రామాల్లో కలిపి మొత్తం 676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాకు ఇప్పటికే 7,001 పోలియో వ్యాక్సిన్ వాయిల్స్ వచ్చాయి. ఈ మేరకు 68 రూట్లు విభజించి 68 మంది పర్యవేక్షకులను నియమించారు. అలాగే 24 సంచార బృందాలు, 2,824 మంది వ్యాక్సినేటర్లు, 208 మంది ఏఎన్‌ఎంలు, 869 ఆశాలు, 1,124 అంగన్‌వాడీలు, 628 మంది వలంటీర్లు పోలియో చుక్కల పంపిణీలో పాల్గొననున్నారు. ప్రస్తుతం జిల్లాలో 0–5 ఐదేళ్లలోపు వారు 1,10,136 మంది చిన్నారులు ఉండగా.. అందరికీ చుక్కల మందు వేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఉదయం 7 గంటల నుంచి చుక్కల మందు వేసే కార్యక్రమం ప్రారంభించి.. 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. అలాగే ప్రతి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో కూడా చుక్కల మందు పాయింట్స్, 30 మొబైల్ టీంలు ఏర్పాటు చేశారు.

7 గంటల నుంచి ప్రారంభం

జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమం కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కల పంపిణీ కొనసాగుతుంది. 0– 5 ఏళ్లలోపు పిల్లలకు బాధ్యతగా తల్లిదండ్రులు చుక్కల మందు వేయించాలి. జిల్లాలో 1,10,136 మంది చిన్నారులు ఉండగా.. 1,589 వలస చిన్నారులను గుర్తించాం. మొత్తం 2,824 మంది వ్యాక్సినేటర్లు చుక్కలు వేస్తారు.

– శంకర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

29 స్టాక్ పాయింట్లు

పోలియో చుక్కల మందు పంపిణీ మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాకేంద్రంతోపాటు దేవరకద్ర, జడ్చర్ల, నవాబ్‌పేట ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో చుక్కల మందు వ్యాక్సిన్ నిల్వ ఉంచుకొని అవసరమైన చోటికి పంపిస్తారు.

తల్లిదండ్రుల బాధ్యత..



అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

జిల్లాలో ఐదేళ్ల చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. జిల్లాలో 1,10,136 మంది చిన్నారులను గుర్తించామని, 676 బూత్‌ల ద్వారా చుక్కల మందు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు చుక్కల మందు వేయించాలన్నారు. ఆదివారం తప్పిపోయిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కల మందు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, భాస్కర్‌నాయక్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మోక్షం



భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో వెలసిన ప్లాట్లు

- లేవుట్ క్రమబద్ధీకరణ స్కీంకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఈ నెలాఖరులోగా ఫీజు చెల్లింపునకు గడువు
- పాత నిబంధనల ప్రకారమే రెగ్యులరైజేషన్
- ప్రభుత్వానికి సమకూరనున్న భారీ ఆదాయం
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో 46,233 దరఖాస్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల పరిష్కారానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఈ దరఖాస్తుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 31లోగా అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో కదలిక రానుంది. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలగనుండగా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరనుంది. అయితే దీనిపై కొత్తగా ఎలాంటి మార్గదర్శకాలు ప్రకటించని ప్రభుత్వం 2020లో సూచించిన చార్జీల ప్రకారమే చేపట్టాలని ఆదేశించింది.

నిబంధనలకు విరుద్ధంగా..

అనుమతి లేని లేవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 ఆగస్టు 26 వరకు ఉన్న వాటిని క్రమబద్ధీకరించేందుకు జీఓ 131 జారీ చేసింది. ఇందులో భాగంగా అదే ఏడాది ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ప్లాట్లు కొనుగోలు చేసినవారు దరఖాస్తుతోపాటు రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే లేవుట్లకు రూ.10 వేల ఫీజు చెల్లించారు. వాటిని రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉండగా రాష్ట్రస్థాయిలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. తిరిగి రెండేళ్ల తర్వాత 2023 ఏప్రిల్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

మున్సిపాలిటీల వారీగా..

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు త్వరలోనే పరిష్కారం కానున్నాయి. దీనికి సంబంధించి మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పది విలీన గ్రామాల నుంచి మొత్తం 31,144 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 2,075 దరఖాస్తులు పరిష్కరించగా ఇంకా 29,069 పెండింగ్‌లో ఉన్నాయి.

- భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు మొత్తం 5,999 దరఖాస్తులు రాగా.. 976 పరిష్కారానికి నోచుకోగా ఇంకా 5,023 పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో అమిస్తాపూర్ నుంచి 4,049 దరఖాస్తులు రాగా 910 పరిష్కారానికి నోచుకోగా ఇంకా 3,139 పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే భూత్పూర్ పట్టణం నుంచి 1,950 రాగా 66 పరిష్కరించగా 1,884 పెండింగ్‌లో ఉన్నాయి.
- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు మొత్తం 9,090 దరఖాస్తులు రాగా 13 మాత్రమే పరిష్కారం కాగా ఇంకా 9,077 పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక విలీన గ్రామాలైన బాదేపల్లి నుంచి 6,231 దరఖాస్తులు రాగా.. ఒకటి మాత్రమే పరిష్కరించగా ఇంకా 6,230 పెండింగ్‌లో ఉన్నాయి. బూరెడ్డిపల్లి నుంచి 2,013 రాగా, 185 పరిష్కారం కాగా 1,828 పెండింగ్‌లోనే ఉన్నాయి. నాగసాల నుంచి 230 రాగా, 36 పరిష్కారం కాగా 194 పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వానికి ఆదాయం

నిధుల కొరతతో సతమతమవుతున్న జిల్లాలోని మున్సిపాలిటీలు ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కలిసి రానుంది. అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణతో మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దరఖాస్తుకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువలో 14 శాతం డబ్బులు వసూలు చేస్తారు. ఈ పథకం కింద 100 గజాల్లోపు ప్లాటు రెగ్యులరైజేషన్ కోసం గజానికి రూ.200 చొప్పున చార్జీ చెల్లించాలి. 100 నుంచి 300 గజాల వరకు ఉన్న స్థలాలకు గజానికి రూ.400, 300లకుపైగా ఉంటే గజానికి రూ.600 చొప్పున చార్జీలు చెల్లించాలని పేర్కొంది.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్ కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం కోసం 2020 సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు ఇప్పుడు కొత్త వారు కూడా అర్హులే. గడువులోగా పూర్తి వివరాలతో టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించాలి. అన్నీ సక్రమంగా ఉంటే అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

– మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేద్దాం



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి పాదయాత్రలను విజయవంతం చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సోమవారం నుంచి మహబూబ్‌నగర్ అసెంబ్లీ పరిధిలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ న్యాయ యాత్ర జరుగుతుందన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ మండలం, హన్వాడ మండలంలో, మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో పాదయాత్ర సాగుతుందన్నారు. అలాగే బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఉంటుందని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకమని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లను గెలుచుకుంటుందన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, చంద్రశేఖర్, రాములుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అవేజ్, రమేశ్, ఫైసల్, అబ్దుల్ హక్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను విస్తరించడంలో కీలకపాత్ర పోషించాలి




పారా లీగల్ వలంటీర్లతో న్యాయమూర్తి

పాలమూరు: జిల్లాలోని ప్రతి గ్రామానికి చట్టాలను విస్తరించే విధంగా పారా లీగల్ వలంటీర్లు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. ఎప్పటికప్పుడూ నూతన చట్టాలను గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి తెలియజెప్పడానికి పారా లీగల్ వలంటీర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవన్‌లో పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వలంటీర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో వివిధ కోర్టుల న్యాయమూర్తులు సంధ్యారాణి, చంద్రకళ, చైతన్య, హరికుమార్, భావన తదితరులు పాల్గొన్నారు.

శివోహం.. శివోహం

- అలంపూర్‌లో రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఈ ఏడాది మహాకుంభాభిషేకం ప్రత్యేకం..
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ
- ముస్తాబైన ఆలయాలు

– జోగుళాంబ శక్తిపీఠం



– వివరాలు 8లో..

క్లుప్తంగా

నీటి ట్యాంక్‌లో పడి వాటర్‌మ్యాన్ మృతి


సుధాకర్(ఫైల్)

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌కి చెందిన వాటర్‌మ్యాన్ సుధాకర్ ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్‌లో పడి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం గ్రామానికి మిషన్‌భగీరథ నీటిని నల్లాలకు విడుదల చేశాడు. ఆ తర్వాత ట్యాంక్‌లో నీటిని పరిశీలించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సుధాకర్ కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు వాటర్ ట్యాంక్‌లో వెతకగా మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య నారాయణమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. వాటర్ మ్యాన్ మృతి విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ సత్యం, గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరకు చెందిన పి.రాములు (30) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు రాములు 9ఏళ్ల క్రితం వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి చెందిన అనితతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని రోజులుగా సంసార విషయంలో తరుచూ గొడవ పడుతుండేవారు. మూడు రోజుల క్రితం గొడవ పడ్డారు. దీంతో భార్య, ఇద్దరి పిల్లలను తీసుకొని పుట్టినిల్లుకి వెళ్లింది. మూడు రోజులుగా బాధపడుతుంటే తల్లిదండ్రులు రాములును ఓదార్చారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాములు చీరతో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. చుట్టు పక్కల వారు గమనించి విషయం తండ్రి దేవన్నకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బిడ్డ మృతితో.. తల్లి ఆత్మహత్య

జడ్చర్ల: పుట్టిన బిడ్డ మరుసటి రోజే తీవ్ర అనారోగ్యంతో మృత్యువాత పడడంతో తీవ్ర మనోవేదనకు గురైన తల్లి శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి(20) గత నెల 24న ఓ బాబుకు జన్మనిచ్చింది. అయితే మరుసటి రోజు పసికందు తీవ్ర అనారోగ్యానికి మృతి చెందడంతో శ్రీలక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురైంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కుమ్మరి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలో గత నెల 29న తల్లిదండ్రులు వ్యవసాయ పొలానికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న 16 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక, యువకుడి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

విద్యుదాఘాతంలో గుడిసె దగ్ధం

లింగాల: మండలంలోని కోమటికుంటలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంలో తోకల శ్రీను పూరిగుడిసె దగ్ధమై రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించిన ఘటన చోటు చేసుకుంది. రాత్రి గ్రామంలో నాటక ప్రదర్శన చూడడానికి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. ఆ సమయంలో షాక్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి తిండి గింజలు, వంట పాత్రలు, దుస్తులు తదితర వస్తు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఎవరు లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన మేరకు రూ.5 వేలు సాయం, 50 కిలోల బియ్యం, దుప్పటు అందజేశారు.

ఎద్దుల బండిని ఢీకొట్టిన లారీ

- మన్యంకొండ జాతరకు వెళ్తుండగా ఘటన

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఎద్దుల బండిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఆరుగురు గాయపడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..సీసీకుంట మండలం దమగ్నాపురంనకు చెందిన పోతుల కవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తెల్లవారుజామున మన్యంకొండ జాతరకు ఎద్దులబండిపై బయలుదేరారు. ఈ క్రమంలో కోట కదిర స్టేజీ వద్ద రాయిచూర్ వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా వెనుక నుంచి బండిని ఢీకొట్టింది. ఘటనలో బండిపై ఉన్న వెంకటమ్మ, లక్ష్మి, మంజుల, ప్రణీత, కవీందర్‌తో పాటు ఏడాది వయసున్న చిన్నారికి రక్త గాయాలయ్యాయి. అదేవిధంగా ఎద్దులు సైతం గాయపడ్డాయి. బండి దెబ్బతింది. కాగా బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారి కుటుంబ సభ్యుడు మాసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎందుకీ నిర్లక్ష్యం?

నంబర్ ప్లేట్ లేని వాహనాలు.. ర్యాష్ డ్రైవింగ్.. పరిమితికి మించి ప్రయాణం.. ఇలా ఒకటేమిటి రాంగ్ రూట్, నో పార్కింగ్, లైసెన్స్, వాహనాలకు సంబంధించి సరైన పేపర్లు లేకపోవడం వంటి ప్రతి నిబంధనను ఉల్లంఘించే వాహనదారులు.. షరామామూలుగానే ఈ–చలాన్లపై రాయితీని సైతం పెడచెవిన పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీలు కల్పించి.. ముచ్చటగా మూడుసార్లు గడువు పొడిగించినా.. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ మినహా మిగతా ఎక్కడా 50 శాతం కూడా పెండింగ్ చలాన్లు చెల్లించలేకపోయారంటే ఉల్లం'ఘనుల' తీరును అర్థం చేసుకోవచ్చు.



- పెండింగ్ ఈ–చలాన్ల చెల్లింపులో స్పందన కరవు
- మూడుసార్లు అవకాశం ఇచ్చినా ముందుకురాని వైనం
- రాయితీలపై ఆసక్తి చూపని వాహనదారులు
- ఉమ్మడి జిల్లాలో రూ.8.91 కోట్లు వసూలు
- ఇప్పటి వరకు చెల్లించినవి 13,88,888.. ఇంకా చెల్లించాల్సిన చలాన్లు 7,71,249

మహబూబ్‌నగర్ క్రైం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్లు చెల్లించడానికి ప్రభుత్వం భారీగా రాయితీలు కల్పించిన కూడా వాహనదారులు ముందుకు రాలేదు. ఒకవైపు ప్రత్యేక రాయితీలు.. మరోవైపు ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీలు చేపట్టి సూచించినా.. ఆశించిన స్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో చాలా వరకు కార్ల యజమానులు సైతం పెండింగ్ ఈ– చలాన్స్ చెల్లించడానికి ఆసక్తి చూపలేదు. ఇలా ఒక్కసారి కాదు.. ఏకంగా మూడు సార్లు అవకాశం కల్పించినా కూడా వాహనదారులు నిబంధనల మాదిరిగానే.. అవకాశాలనూ పెడచెవిన పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఈ–చలాన్స్‌పై ప్రకటించిన రాయితీలు ఈ నెల 15తో ముగిసింది. గతేడాది డిసెంబర్ 27 నుంచి ఈ–చలాన్స్‌పై ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో వాహనదారులకు వెసులుబాటు కల్పించినట్లు అయ్యింది. దీంతో పోలీస్ శాఖ జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఈ–చలాన్స్ కట్టించే విధంగా కృషిచేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13,88,888 పెండింగ్ చలాన్స్ ఉండగా.. 6,17,639 నుంచి రూ.8.91 కోట్లు వసూలయ్యాయి. ఇంకా 7,71,249 చలాన్లకు సంబంధించి జరిమానాలు రాబట్టాల్సి ఉంది.

మూడుసార్లు పొడిగింపు..

రాష్ట్ర ప్రభుత్వం ఈ– చలాన్స్‌పై మొదట గతేడాది డిసెంబర్ 27 నుంచి జనవరి 10 వరకు మొదట అవకాశం కల్పించి పెండింగ్ చలాన్స్ చెల్లించాలని సూచించింది. ఇచ్చిన గడువులో కనీసం 20 శాతం వాహనదారులు కూడా ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం మళ్లీ రెండోసారి జనవరి 10 నుంచి 31 వరకు పొడిగించింది. అయినా కూడా స్పందన లేకపోవడంతో మళ్లీ మూడోసారి ఫిబ్రవరి 15 వరకు అవకాశం ఇచ్చింది. ఇకపై రోడ్లపై వాహనాలను తనిఖీ చేసి పెండింగ్ ఈ–చలాన్స్ వంద శాతం వసూలు చేయాలని పోలీసులు ఆదేశించింది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

రాష్ట్ర పోలీస్ శాఖ పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్స్‌పై ప్రకటించిన రాయితీల్లో ఆర్టీసీ బస్సులపై 90 శాతం, ద్విచక్ర వాహనాలపై 80 శాతం, ఆటోలు, కార్లు ఇతర ఫోర్ వీలర్స్‌పై 60 శాతం, లారీలు, ఇతర భారీ వాహనాలపై 50 శాతం రాయితీ కల్పించింది. ఈ రాయితీలను అధికంగా ద్విచక్ర వాహనదారులు సద్వినియోగం చేసుకోగా.. ఆ తర్వాత కారు యాజమానులు సైతం పెండింగ్ చలాన్స్ చెల్లించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రూ.3 కోట్లు ఈ–చలాన్ జరిమానాలు వసూలు కాగా.. అత్యల్పంగా నారాయణపేట నుంచి రూ.86 లక్షలు వసూలయ్యాయి. ఇక ఐదు జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్ రాయితీలను 6,17,639 మంది వాహనదారులు సద్వినియోగం చేసుకోవడం జరిగింది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్ జరిమానాలను చెల్లించడానికి రాష్ట్ర నూతన ప్రభుత్వం డిసెంబర్ 27 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రత్యేక రాయితీ కార్యక్రమం నిర్వహించింది.

జిల్లా	పెండింగ్ ఈ–చలాన్ కేసులు	చెల్లించాల్సినవి
మహబూబ్‌నగర్	4,83,254	2,21,947
గద్వాల	2,43,384	1,53,409
వనపర్తి	2,68,391	1,54,846
నాగర్‌కర్నూల్	2,15,612	1,22,838
నారాయణపేట	1,78,247	1,18,209
మొత్తం	13,88,888	7,71,249

ఉమ్మడి జిల్లాలో చెల్లించిన ఈ- చలాన్ వివరాలు

జిల్లా	చెల్లించిన ఈ–చలాన్ కేసులు	నగదు	శాతం
మహబూబ్‌నగర్	2,61,307	3,10,95,585	54.07
గద్వాల	89,975	1,86,05,085	36.97
వనపర్తి	1,13,545	1,64,94,810	42.31
నాగర్‌కర్నూల్	92,774	1,43,32,405	43.03
నారాయణపేట	60,038	86,46,865	33.68

తనిఖీలు నిర్వహిస్తాం..

పెండింగ్ ఈ–చలాన్స్‌పై ప్రభుత్వం కల్పించిన రాయితీ గడువు గతనెల 15 నాటికి ముగిసింది. పెండింగ్ ఈ–చలాన్స్ కానీ, ఎంవీఐ యాక్ట్ కేసుల్లో వంద శాతం జరిమానాలు వసూలు చేస్తాం. దశల వారీగా తనిఖీలు నిర్వహించి పెండింగ్ చలాన్స్ చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ

లారీ డ్రైవర్, క్లీనర్‌ల చేతివాటం

- ఫ్లిప్‌కార్ట్ వస్తువుల అపహరణ
- 405 వస్తువులు.. రూ.36.66 లక్షల విలువ

జడ్చర్ల: ఫ్లిప్‌కార్ట్ కంపెనీకి సంబంధించిన వస్తువులను తరలిస్తున్న గూడ్స్ లారీకి డ్రైవర్, క్లీనర్ పెద్ద రంధ్రం చేసి అందులోని సామగ్రిని అపహరించిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గత నెల 26న కమైన్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు లారీలో రూ.36,65,875 విలువ ఉన్న ఫ్లిప్‌కార్ట్ కంపెనీకి చెందిన 405 వస్తువులను తరలిస్తున్నారు. జడ్చర్లలో ఓ దాబా వద్ద గంటల తరబడి లారీ నిలబడి ఉండటంతో జీపీఎస్ లింక్ ద్వారా గుర్తించిన కంపెనీ అధికారులు డ్రైవర్ రఫీక్, క్లీనర్ షరీఫ్‌కు ఫోన్లు చేయగా స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో మరుసటి రోజు సంబంధిత అధికారులు లారీ దగ్గరకు చేరుకొని విచారించారు. డ్రైవర్, క్లీనర్ కుమ్మక్కై లారీకి ఓ పక్క పెద్ద రంధ్రం చేసి అందులోని వస్తువులను మరో వాహనంలో వేసుకుని తరలించినట్లు గుర్తించారు. శనివారం కంపెనీ ప్రతినిధి హర్‌పాల్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

'చికెన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు'

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూర్ శివారులో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న స్నేహ చికెన్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ ఎలాంటి నిబంధనలు పాటించకుండా స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు స్పందించిన కమిషన్ వివరణ ఇవ్వాలని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాసైన్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజు, ప్రసాద్‌నాయుడు, రామచంద్రయ్యచారి, ప్రసాద్, అనుదీప్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతితో అసభ్యకర ప్రవర్తన

- పెద్దల సమక్షంలో రాజీకి ప్రయత్నం?
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

గద్వాల క్రైం: ఓ మతబోధన శాలలో ఇంటర్ స్థాయి విద్య అభ్యసిస్తున్న యువతితో అక్కడే పనిచేస్తున్న ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ యువతి గద్వాలలోని ఓ మతానికి చెందిన ప్రైవేటు బోధనశాలలో ఇంటర్ స్థాయి విద్య అభ్యసిస్తుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి యువతితో చనువుగా ఉంటూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు బోధనశాలకు చెందిన కొందరు యువతి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయంపై వాకబు చేసేందుకు సదరు యువతి తల్లిదండ్రులు బోధనశాలకు రావడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కాగా, ఈవిషయం బహిర్గతమైతే బోధనశాలకు చెడ్డపేరు వస్తుందని మతపెద్దలు యువతి తల్లిదండ్రులకు నచ్చజేపే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆర్థిక పరమైన సహాయం అందేలా చూస్తామని రాజీ ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాజీ ప్రయత్నంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులను వైరల్ చేశారు. జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. సామాజిక మాధ్యమాల ద్వారా ఈవిషయం తమ దృష్టికి వచ్చిందని.. బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే, ఆకతాయిలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

540 కేజీల బెల్లం, పటిక స్వాధీనం

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీదితండాలో శనివారం ఉదయం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 5 లీటర్ల సారా, 540 కేజీల బెల్లం, 100 కేజీల పటికతోపాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. తండాకు చెందిన సభావత్ కోమిటి, కాంసానిపల్లి తండాకు చెందిన మూడావత్ మోహన్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. రామావత్ శివ ద్వారా హైదరాబాద్ నుంచి బెల్లం, పటికను తండాకు తీసుకొచ్చినట్లు తమ విచారణలో తేలినట్లు సీఐ వెల్లడించారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. శనివారం1,015 అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊకచెట్టు వాగు వంతెన కింద నీటి మట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని ఏఈ. సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు.

రుణం ఇప్పిస్తామని చెప్పి మోసం

నాగర్‌కర్నూల్ క్రైం: రుణం ఇప్పిస్తామని చెప్పి మోసానికి పాల్పడిన ఘటన ఘటన మండలంలోని మంతటిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగయ్యకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి లోన్ ఇప్పిస్తానని చెప్పడంతో నమ్మాడు. ప్రాసెసింగ్ ఫీజ్, జీఎస్టీ కోసం రూ1.90లక్షలు చెల్లించాలని చెప్పాడు. నాగయ్య తన ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు నగదును బదిలీ చేశారు. కొద్దిసేపటి తర్వాత ఆ వ్యక్తి చేసిన ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేయడంతో స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మన్యంకొండలో పద్యనాటక ప్రదర్శనలు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో మన్యంకొండలో దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న పద్య నాటక ప్రదర్శనలు శనివారం రాత్రి రెండో రోజు కొనసాగాయి. చిన్నారుల నృత్యం ప్రదర్శనలతో పాటు శ్రీకృష్ణరాయబారం, మైరావణ పూర్తి నాటకం, గయోపాఖ్యానం, మాయలపకీరు ఏకపాత్రాభినయం నాటకాలను ప్రదర్శించారు. శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, కర్ణ రహస్యం తదితర నాటకాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రాంగోపాల్, శ్రీమిత్ర కళానాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు..


చిన్నారుల నృత్య ప్రదర్శన


నాటక ప్రదర్శనలు

అందుబాటులోకి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం



మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

- పే అండ్ ప్లే పద్ధతిలో వినియోగించుకునే అవకాశం
- ఈనెల 5 నుంచి ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో ఆధునిక హంగులతో నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఈనెల 5వ తేదీ నుంచి వినియోగంలోకి రానుంది. ఇందులో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ఆరు కోర్టులు ఏర్పాటు చేశారు.

పేఅండ్‌ప్లే విధానంలో..

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, ఔత్సాహికులు పేఅండ్‌ప్లే పద్ధతిలో కోర్టులను వినియోగించుకునేందుకు జిల్లా యువజన, క్రీడలశాఖ అవకాశం కల్పించింది. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు, సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7.30 వరకు వారికి కేటాయించిన సమయం ప్రకారం ప్రాక్టీస్ చేసుకోవచ్చు. 15 ఏళ్లలోపు వారికి అడ్మిషన్ ఫీజు రూ.1,200 నెలకు రూ.800.. 15 ఏళ్ల పైబడి వారికి అడ్మిషన్ ఫీజు రూ.1,500, నెలకు రూ.వెయ్యిగా నిర్ణయించారు. ఆసక్తిగల క్రీడాకారులు వివరాల నమోదుకు సునీల్‌కుమార్(అథ్లెటిక్స్ కోచ్) – 94406 56162, మల్లేష్(కబడ్డీ కోచ్) – 89782 47482, అంజద్ (స్విమ్మింగ్ కోచ్) – 96769 96016 సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో పేఅండ్‌ప్లే పద్ధతిలో షటిల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం కల్పించాం. షటిల్ నేర్చుకునేవారు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్‌కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు డీవైఎస్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలి.

– ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి, మహబూబ్‌నగర్

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి


జిల్లా కబడ్డి జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

- నాగార్జునసాగర్‌కు తరలిన జిల్లా కబడ్డీ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబర్చి చాంపియన్‌గా నిలవాలని జిల్లా కబడ్డి సంఘం ప్రధానకార్యదర్శి కురుమూర్తిగౌడ్ కోరారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక ప్రధాన స్టేడియం నుంచి జిల్లా జట్టును సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చన్నారు. గతంలో పలు మార్లు జిల్లా జట్టు విజేతగా నిలిచిందని.. అదే స్ఫూర్తితో ఈ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డి అసోసియేషన్ సభ్యులు దామోదర్‌రెడ్డి, బాల్‌రాజు, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కోచ్ మల్లేష్, మేనేజర్ గణేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో ప్రత్యేక పాత్ర


దుస్తులు పంపిణీ చేస్తున్న రవిచంద్రన్

కల్వకుర్తి రూరల్: సామాజిక సేవలో వాసవీ క్లబ్‌లది ప్రత్యేకపాత్ర అని క్లబ్ ఇంటర్ నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రపతి అవార్డు లభించిందన్నారు. శనివారం స్థానిక క్లబ్ భవనాన్ని సందర్శించారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. కల్వకుర్తి నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా శ్రీలక్ష్మి, ఆంజనేయులు, కోశాధికారిగా ధనలక్ష్మి, అశోక్ ప్రమాణం చేశారు. రాబోయే సంవత్సరంలో పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. 20 మంది మహిళలకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గవర్నర్ జగదీశ్వర్, సత్యం, శ్రీధర్, లింగం, కృష్ణయ్య, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చుకో.. దండుకో

డబ్బుతో రండి.. అధికారంలోకి వస్తే దండుకోండి

బడాబాబులకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓపెన్ ఆఫర్

- కోట్లు ఇచ్చే ఎన్నారైలు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులకే పెద్దపీట
- పెమ్మసాని, వెనిగండ్ల రాము, అమిలినేని సురేంద్రబాబు, కాకర్ల సురేష్‌లకు రెడ్‌కార్పెట్



- అధికారంలోకి వస్తే ప్రజాధనాన్ని దోచుకునే వెసులుబాటు కల్పిస్తానంటూ బాబు భరోసా
- మరింతమందికి గాలం వేసేందుకు బాబు, చినబాబు పన్నాగాలు..
- ఓటమి భయంతో ముందుకు రాని 'పెట్టుబడి'దారులు
- టీడీపీ– జనసేన సభ అట్టర్ ఫ్లాప్‌తో వెనుకంజ

సాక్షి, అమరావతి: రాజకీయాలను పక్కా వ్యాపారంగా మార్చేసి.. ఓటుకు కట్లు అలవాటు చేసిన పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇపుడు సొమ్ములున్న బడాబాబులకు రకరకాల ఆఫర్లతో సీట్లు ఎరవేస్తున్నారు. వందల కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చుకో.. అన్నీ కుదిరి అధికారంలోకి వస్తే దొరికినంత దోచుకో.. ఇదీ 'పెట్టుబడి'దారులకు చంద్రబాబు ఓపెన్ ఆఫర్. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీని నమ్ముకుని పనిచేస్తున్న సీనియర్ నేతలను పక్కనపెట్టి.. సొమ్ములు సమకూర్చడానికి అంగీకరించిన ఎన్నారైలు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులకు అభ్యర్థుల ఎంపికలో పెద్దపీట వేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక మంత్రివర్గంలోకి తీసుకుని కీలక మంత్రిత్వ శాఖను అప్పగిస్తానని కొందరికి.. భారీ ఎత్తున లాభాలు వచ్చే కాంట్రాక్టు పనులు, గనులు అప్పగిస్తానంటూ మరికొందరికి భరోసా కల్పిస్తున్నారు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో భారీగా నిధులు సమకూర్చిన నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణను ఎమ్మెల్సీని చేసి, రాజధాని నిర్మాణంతో ముడిపడిన కీలకమైన పురపాలక పట్టణాభివృద్ధి శాఖ అప్పగించానని గుర్తు చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిన భారీ ఎత్తున భూములు కాజేసిన నారాయణ.. ఇన్నర్ రింగ్ అలైన్‌మెంట్ మార్చేసి, రాజధానిలో తాత్కాలిక నిర్మాణాలతో పాటు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు, శాశ్వత నిర్మాణాల పనుల టెండర్లు, టిడ్కో గృహాల టెండర్లలో భారీ ఎత్తున అవినీతికి పాల్పడి వేలాది కోట్ల రూపాయలను కొల్లగొట్టాడు.. అవన్నీ ఇపుడు కేసులై మెడకు చుట్టుకున్నాయనుకోండి.. అది వేరే సంగతి...

పెమ్మసాని నుంచి అమిలినేని దాకా..

గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి నిష్క్రమించడంతో ఆ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు టీడీపీ సీనియర్ నేత, ట్రాన్స్‌ట్రాయ్ అధినేత రాయపాటి సాంబశివరావు ఆసక్తి చూపారు. పోలవరం హెడ్ వర్క్స్ పనులను 2013లో దక్కించుకున్న రాయపాటి మొబిలైజేషన్ అడ్వాన్సుగా ప్రభుత్వం నుంచి తీసుకున్న సొమ్ములో రూ.150 కోట్లు 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఇవ్వడం వల్లే నరసరావుపేట లోక్‌సభ స్థానం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని రాయపాటి తనయుడు రాయపాటి రంగరావు ఇటీవల అంగీకరించారు. ట్రాన్స్‌ట్రాయ్ దివాలా తీయడం, రాయపాటి ఆర్థికంగా కుదేలవడంతో ఈసారి టికెట్ ఇచ్చేది లేదని చంద్రబాబు కుండ బద్దలు కొట్టేశారట. తెనాలికి చెందిన ఎన్నారై పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ఎత్తున పెట్టుబడి పెడుతుండడంతో ఆయనను గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఇదే రీతిలో పెట్టుబడి పెట్టడంతో గుడివాడ నియోజకవర్గంలో సీనియర్ నేత రావి వెంకటేశ్వరరావును పక్కన పెట్టి టీడీపీ అభ్యర్థిగా ఎన్నారై వెనిగండ్ల రామును.. విజయవాడ లోక్‌సభ అభ్యర్థిగా కేశినేని చిన్నిలను చంద్రబాబు ఎంపిక చేశారు. నెల్లూరు జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును పక్కన పెట్టి.. పెట్టుబడి పెట్టిన ఎన్నారై కాకర్ల సురేష్‌ను చంద్రబాబు ఎంపిక చేశారు. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ–నీవా రెండో దశ పనుల్లో పాత కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద తొలగించి.. మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్‌కు కట్టబెట్టిన చంద్రబాబు.. భారీ ఎత్తున కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఇప్పుడు కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు పెట్టుబడి పెట్టడంతో అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరికి మొండి చేయి చూపారు. అమిలినేని సురేంద్రబాబును అభ్యర్థిగా ఖరారు చేశారు.

ఓటమి భయంతో పెట్టుబడిదారులు వెనుకంజ..

ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి జనవరి 27న భీమిలి.. గత నెల 3న దెందులూరు.. గత నెల 18న రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు సభ అతి పెద్ద ప్రజాసభగా నిలిచింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని రాప్తాడు 'సిద్ధం' సభతో తేలిపోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టైమ్స్ నౌ, జీన్యూస్, రిపబ్లిక్ టీవీ, జన్‌మత్, జనాధార్ ఇండియా వంటి జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ప్రీపోల్ సర్వేల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని.. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని వెల్లడించాయి. టీడీపీ–జనసేన పొత్తులో సీట్ల పంపకాల 'లెక్క' తేలాక ఇరు పక్షాలు తొలిసారిగా ఉమ్మడిగా పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెంలో గత నెల 28న 'తెలుగుజన విజయకేతన జెండా' సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అవకాశవాదంతో పొత్తు పెట్టుకోవడం వల్లే ఆ రెండు పక్షాలు ఉమ్మడిగా నిర్వహించిన తొలి సభలోనే జనం ఛీకొట్టారని.. ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి ఘోరంగా ఓడిపోతుందనడానికి ఇది సంకేతమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో వాస్తవ పరిస్థితిని పసిగట్టిన పెట్టుబడిదారులు ఓటమి భయంతో టీడీపీలో చేరేందుకు ఇప్పుడు వెనుకంజ వేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో సీట్లు దక్కని వారితో చేరికల డ్రామాలు..

వ్యక్తిగత కారణాలతో.. టికెట్లు దక్కక వైఎస్సార్‌సీపీని వీడిన వారిని చేర్చుకోవడం ద్వారా టీడీపీకి క్రేజ్ ఉందని చూపి పెట్టుబడిదారులను సమ్మోహనపరిచేందుకు చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత కారణాలతో.. టికెట్లు దక్కక వైఎస్సార్‌సీపీని వీడిన లావు కృష్ణదేవరాయలు, వసంత కృష్ణప్రసాద్, జంగా కృష్ణమూర్తి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు చంద్రబాబు టీడీపీ తీర్థం ఇచ్చారు. ఇందులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా, ఆయన భార్య ప్రశాంతిని కోవూరు అభ్యర్థిగా.. లావు కృష్ణదేవరాయలును నరసరరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా.. వసంత కృష్ణప్రసాద్‌ను మైలవరం అభ్యర్థిగా చంద్రబాబు ఖరారు చేశారని టీడీపీ వర్గాలు వెల్లడించాయి.

ఈసారి నారాయణ వాటా రూ.900 కోట్లు..

నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ 2014 వరకూ చంద్రబాబు ఆర్థిక వ్యవహారాలను పరోక్షంగా చూశారు.. ఆ ఎన్నికల్లో టీడీపీకి భారీ ఎత్తున నిధులు సమకూర్చారు. భారీ ఎత్తున ధనం వెదజల్లడంతో 2014 ఎన్నికల్లో కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. మంత్రివర్గంలో నారాయణకు కీలకమైన పురపాలక పట్టణాభివృద్ధి శాఖను కేటాయించిన చంద్రబాబు.. ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారు. ఐదేళ్లపాటు ఆకాశమే హద్దుగా చెలరేగిన నారాయణ భారీ ఎత్తున ప్రభుత్వ ఖజానాను.. ప్రజల ఆస్తులను దోచేశారు. గత ఎన్నికల్లో నెల్లూరు అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోరంగా ఓడిపోయిన నారాయణ.. వచ్చే ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. టీడీపీకి ఎన్నికల ఖర్చుల కోసం ఇప్పటికే ప్రజల నుంచి మార్వాడీలు, వ్యాపారుల నుంచి రూ.650 కోట్లను సమీకరించిన నారాయణ చేర్చాల్సిన చోటకు చేర్చారు. వారం క్రితం మార్కాపురం, కందుకూరు, గిద్దలూరు నియోజకవర్గాల్లో వ్యాపారుల నుంచి రూ.2 నుంచి రూ.3ల వడ్డీకి మరో రూ.250 కోట్లను సమీకరించిన నారాయణ టీడీపీకి ఎన్నికల నిధి కింద అందజేశారు. మొత్తమ్మీద ఈసారి తన వాటాగా నారాయణ రూ.900 కోట్లు సమకూర్చారని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

హైదరాబాద్‌లో మకాం వేసి రాయ 'బేరాలు'..

హైదరాబాద్‌లో మకాం వేసిన తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్‌లు పెట్టుబడిదారులతో రాయబారాలు.. భేరసారాలు జరుపుతున్నారు. ఇప్పుడు పెట్టుబడి పెట్టండి.. కోరుకున్న స్థానం నుంచి పోటీ చేయండి.. అధికారంలోకి వస్తే దొరికినంత దోచుకోవడానికి వెసులుబాటు కల్పిస్తా అంటూ ఎన్నారైలు, రియల్టర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులతో చంద్రబాబు రాయబారాలు నడుపుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ఫర్వాలేదు.. పెట్టుబడి పెడితే అధికారంలోకి వచ్చాక భారీ ఎత్తున దోచుకోవడానికి అవకాశం కల్పిస్తానంటూ రాజకీయాల నుంచి నిష్క్రమించిన ఆ పార్టీ ప్రజాప్రతినిధితోనూ చంద్రబాబు బేరసారాలు జరిపినా ఫలితం రాలేదని టీడీపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

జగన్‌ను గెలిపించాలి.. జనం గెలవాలి

బీసీ కులాల ఆత్మీయ సమావేశం పిలుపు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించడం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు మళ్లీ గెలవాలని బీసీ కులాల ఆత్మీయ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో రాష్ట్రంలోని 139 బీసీ కులాలకు చెందిన సంఘాల ముఖ్య నేతల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ 58 నెలల పాలనలో బీసీలకు జరిగిన ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలపై పలువురు వక్తలు మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. జనాభాలో 52 శాతంపైగా ఉన్న బీసీలకు కనీసం 50 శాతం పదవులు ఇవ్వాలని ఇంతకాలం కొట్లాడామని, అయితే సీఎం వైఎస్ జగన్ బీసీలకు ఏకంగా 70 శాతం పదవులు ఇచ్చి సంఘ సంస్కర్తగా నిలిచారని అన్నారు. ఇటీవల తాను కర్ణాటక, తమిళనాడు ముఖ్యమంత్రులను కలిసినప్పుడు.. బీసీలైన మీరు బీసీలకు 50 శాతం పదవులు ఎందుకివ్వలేకపోతున్నారు? అని అడిగితే వాళ్లు ఇచ్చిన సమాధానం ఆశ్చర్యం కలిగించిందన్నారు. మేము 40 శాతం పదవులు ఇవ్వడానికే ఇబ్బందులు పడ్డామని, మీ ముఖ్యమంత్రిలాగా మేము బీసీలకు పదవులు ఇస్తే మా రాష్ట్రాల్లో సంపన్న వర్గాలు మమ్మల్ని సీఎం సీటులో కూర్చోనీయవని చెప్పారన్నారు. సీఎం వైఎస్ జగన్ మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రాధాన్యత ఇవ్వాలంటే ఎంతో ధైర్యం, సాహసం ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సామాజిక న్యాయాన్ని దేశం మొత్తం కీర్తిస్తోందన్నారు.


బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎంపీ కేశినేని నాని

ఏపీలో కలుస్తామంటున్నారు..

ఏపీలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలు పట్ల పొరుగు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలు చూసి తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా, కర్ణాటకలోని బళ్లారి ప్రాంత వాసులు తమను ఆంధ్రాలో కలపాలని దీక్షలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా చూస్తే.. సీఎం జగన్ మాత్రం తన కుటుంబ సభ్యులుగా చూస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ మరో 20 ఏళ్లపాటు ఏపీ ముఖ్యమంత్రిగా కొనసాగితే పేద వర్గాలు ధనవంతులుగా మారడం ఖాయమన్నారు. ఇది సీఎం జగన్ ఒక్కడి గెలుపుకోసం మాత్రమే కాదని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల గెలుపు కోసమే అని కృష్ణయ్య చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) మాట్లాడుతూ.. మానవ వనరుల అభివృద్ధే అసలైన అభివృద్ధి అని నమ్మి దానిని రాష్ట్రంలో అమలు చేసి చూపించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు.

గెలిచాక వైఎస్సార్‌సీపీ నేతల అంతు చూస్తా: బాబు

దాచేపల్లి: రాబోయే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి విజయం సాధిస్తుందని, అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణాలు పూర్తి చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో శనివారం టీడీపీ నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నేతల అంతుచూస్తానని, వారికి భయపడకుండా 45 రోజులు పోరాడాలని కార్యకర్తలను రెచ్చగొట్టారు. పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.


శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు

శివోహం.. శివోహం...


విద్యుద్దీపాల వెలుగుల్లో అలంపూర్ ఆలయాలు

అలంపూర్‌లో రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- ఈ ఏడాది మహాకుంభాభిషేకం ప్రత్యేకం.. హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ
- ముస్తాబైన ఆలయాలు


యాగశాల నిర్మాణం

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైలం పశ్చిమద్వార క్షేత్రమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఆలయ శిఖరాలకు మహా కుంభాభిషేకం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 60 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ క్రతువు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మహాశివరాత్రి రోజున నిర్వహించే మహాకుంభాభిషేకానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు ఇప్పటికే కార్యక్రమాల రూపకల్పన పూర్తి చేశారు.

వైభవంగా నిర్వహిస్తాం..



ఆగమ పండితులు, ఆలయ అర్చకుల సూచనలు, సలహాల మేరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ఏడాది మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నాం. వేడుకకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పాటు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. మహాశివరాత్రి రోజున ఆలయాల్లో యధావిధిగా అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులకు అవకాశం ఉంటుంది.
– పురేందర్‌కుమార్, ఈఓ, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు

మహాకుంభాభిషేకం.. అదృష్టం



మహాశివరాత్రి రోజు మహాకుంభాభిషేకం జరిపించే అదృష్టం పాలకమండలికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ క్రతువు భక్తులు తిలకించే భాగ్యం వరంగా భావిస్తున్నాం. పరిస్థితిని బట్టి భక్తులకు అవకాశం కల్పిస్తాం.
– చిన్న కృష్ణయ్య, ఆలయ కమిటీ చైర్మన్

12 ఏళ్లకోసారి జరిగే కార్యక్రమం..



క్షేత్రాల్లో మహాకుంభాభిషేకం 12 ఏళ్లకు ఓసారి నిర్వహిస్తారు. అలంపూర్ ఆలయాల్లో చాలాకాలంగా నిర్వహించడం లేదు. ప్రస్తుత పాలకమండలి సభ్యులు, ఈఓ ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమ నిర్వహణకు పూనుకున్నారు. మహాకుంభాభిషేకం ద్వారా దైవికశక్తి ద్విగుణీకృతం అవుతుంది.
– ఆనంద్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

కార్యక్రమాల వివరాలిలా..


- 4వ తేది ఉదయం 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఆచార్యాది రుత్విక్‌వరుణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, నాంది దేవతాహ్వానం. సాయంత్రం 4.30కి యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అగ్ని మదనం, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు క్షేత్రపాలక, చతుష్షష్టియోగిని, నవగ్రహ, సర్వతోభద్ర మండల ఆహ్వానం, వాస్తు హోమం, వాస్తు పర్యాగ్నికరణ, రాత్రి 9 నుంచి 10.30 వరకు కళాపాకర్షణ.
- 5వ తేది ఉదయం 8 గంటలకు చతుర్వేద పారాయణం, మూల మంత్ర, రుద్ర, చండీ హోమాలు, నీరాజన మంత్రపుష్పలు, తీర్థ ప్రసాద వినియోగం. సాయంత్రం 5 నుంచి చతుర్వేద పారాయణం, పంచసూక్త హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు ఉంటాయి.
- 6వ తేదీ ఉదయం 8 గంటలకు చతుర్వేద పారాయణాలు, మూలమంత్ర, రుద్ర, చండీ హోమాలు.. సాయంత్రం 5 నుంచి పంచసూక్త, మూలమంత్ర హోమాలు, నీరజ, ఆశీర్వచనం ఉంటాయి.
- 7వ తేదీ ఉదయం 8 గంటలకు చతుర్వేద పారాయణం, మూలమంత్ర, రుద్ర, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగం.. సాయంత్రం 6 నుంచి ధ్వజారోహణ కార్యక్రమం.
- 8వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కళాన్యాస కార్యక్రమం, మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మహా కుంభాభిషేక కార్యక్రమాలు ఉభయ ఆలయాల్లో కొనసాగుతాయి. అర్ధరాత్రి లింగోద్భవ కాలంకు ముందు నుండి యామపూజలు, లింగోద్భవ కాలంలో ఆకాశజ్యోతి దర్శనం, అనంతరం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- 9వ తేదీ ఉదయం 7 గంటలకు రథోత్సవం.
- 10వ తేదీ రావణ వాహన సేవ.. సాయంత్రం పార్వేట, అశ్వవాహన సేవ ఉంటుంది.
- 11వ తేదీ ఉదయం అవభృదస్నానం, ధ్వజ అవరోహణం ఉంటాయి.

మన్యంకొండ.. భక్త జనసంద్రం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణ శనివారం భక్త జనసంద్రమైంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తండోపతండాలుగా తరలివచ్చారు. ముందుగా ఆలయం ఎదుట ఉన్న కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచే భక్తులు దర్శనానికి బారులు తీరారు. కోనేరు పక్కనున్న ప్రధాన ద్వారం నుంచి గర్భగుడి వరకు భక్తులు దర్శనానికి వేచి ఉండటం కనిపించింది. కొందరు భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు సమర్పించగా.. మరికొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన ఆలయంతో పాటు పక్కనున్న శివాలయంలో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా శేషవాహనసేవ..

మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి శేషవాహన సేవ ఘనంగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని గర్భగుడి నుంచి రథాల మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, కాగడాల వెలుతురులో సేవ ముందుకు కదిలింది. భక్తుల హరినామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. బంగారు ఆభరణాలు, రంగురంగుల పూల అలంకరణలో స్వామివారు ధగధగా మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. రథాల మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరిగి గర్భగుడికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.


దర్శనానికి బారులు తీరిన భక్తులు


కోనేరు వద్ద భక్తుల స్నానాలు


దాసంగాలు తయారుచేస్తున్న భక్తులు

ఆదిశిలా క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణం కిటకిటలాడింది. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి స్వామి వారికి దాసంగాలు పెట్టారు. శనివారం వారాంతపు సంత కావడంతో ఆలయ అవరణ మొత్తం భక్తులతో కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, బాబురావు, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.


ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సేవాలాల్ జీవితం.. ఆదర్శప్రాయం


మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సంత్ సేవాలాల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. శనివారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ యుగ పురుషుడని, సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు జీవితాంతం కృషి చేశారన్నారు. బ్రిటీష్, ముస్లిం పాలకుల వల్ల అస్తవ్యస్తమైన బంజారా జాతిని ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు ఎంతో శ్రమించారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేశారని, అహింసా ఆచరించాలని, శాంతిని బోధించారని పేర్కొన్నారు. అందుకే ఆయన ఒక్క బంజారా జాతికే కాకుండా యావత్ హిందూ సమాజం ఆరాదించే వ్యక్తిగా నిలిచారన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోనా నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన జీవిత చరిత్ర కనుగొనేందుకు చాలామంది కృషి చేస్తున్నారన్నారు. పరిశోధనలో భాగంగా ఆయన స్వస్థలం గుర్తించేందుకు ఒక పాటలోని చరణాలు ఆధారం అయ్యాయన్నారు. ఆయన ఊరు కనుగొన్న తర్వాత 2002 నుంచి అనంతపురం గుత్తిలో పెద్ద జాతర నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, బంజార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోజ్ మహరాజ్, ఈసీ మెంబర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కంట్రోలర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు